జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు సంకెళ్లు వేసి మహబూబ్‌నగర్ జైలు నుంచి అలంపూర్ కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

రాజోళి రైతుకు బేడీలు

మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి బయటకు వస్తున్న రైతులు

మొదటిపేజీ తరువాయి...

మహబూబ్‌నగర్ జిల్లా జైలు నుంచి జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ కోర్టుకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో వారి చేతులకు సంకెళ్లు వేయడం విమర్శలకు కారణమైంది. రైతులకు బేడీలు వేసి తీసుకెళ్తున్న వీడియోలు వైరల్ అయ్యాయి. ఇది లగచర్ల ఘటనను తలపించిందని, రాజోళి రైతుల విషయంలోనూ రేవంత్ సర్కార్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్న విమర్శలు వెల్లువెత్తాయి. తమవారు కోర్టుకు వస్తున్నారని తెలిసి అక్కడికి వెళ్లిన కుటుంబ సభ్యులు బేడీలతో ఉన్న రైతులను చూసి కన్నీళ్లు పెట్టుకున్నారు. పోలీసులు మాత్రం ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారమే నడుచుకున్నామని చెప్తున్నారు.

ఫొటోలు తీస్తే కేసులేనన్న పోలీసులు

ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ నిరసన తెలుపుతున్న రైతులు ఫ్యాక్టరీ యజమానులపై దౌర్జన్యానికి పాల్పడ్డారన్న ఆరోపణలపై ఈ నెల 4న పోలీసులు కేసు నమోదు చేశారు. మొత్తం 40 మందిపై కేసులు నమోదు కాగా 12 మంది రైతులను అదుపులోకి తీసుకుని 14 రోజుల రిమాండ్‌కు పంపారు. మంగళవారం సాయంత్రం గద్వాల జిల్లా ప్రత్యేక న్యాయస్థానం వీరికి షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది. బెయిలు సాయంత్రం రావడం, పూచీకత్తు సమర్పించాల్సి ఉండటంతో విడుదల ఆలస్యమైంది. ఈ లోపు రిమాండ్ గడువు కూడా ముగిసింది. దీంతో వారికి బేడీలు వేసి తీసుకెళ్లి అలంపూర్ జూనియర్ సివిల్ జడ్జి ఎదుట ప్రవేశపెట్టడం సంచలనమైంది. రైతులకు బేడీలు వేసిన విషయం తెలుసుకున్న మీడియా కోర్టు వద్దకు వెళ్లడానికి ముందే వారిని వాహనంలో నేరుగా కోర్టు లోపలికి తీసుకెళ్లారు. రైతులను ఎవరైనా ఫొటోలు, వీడియోలు తీస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు.

ఎస్పీ ఆదేశాల మేరకే సంకెళ్లు!

రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకురావడాన్ని చూసి అక్కడే ఉన్న కొందరు పోలీసులను ప్రశ్నించారు. రిమాండ్‌లో ఉన్న వారికి సంకెళ్లు ఎందుకు వేశారని ప్రశ్నించగా ఓ పోలీసు బదులిస్తూ తమకేం తెలియదని, ఎస్పీ చెప్పినందుకే వేశామని తెలిపారు. కాగా, పోలీసులు అరెస్ట్ చేసిన వారిలో ఎక్కువమంది బీఆర్ఎస్ మద్దతుదారులే ఉండటం గమనార్హం.

ముగ్గురు ఎస్సైలపై వేటు

రైతులకు సంకెళ్లు వేసి తీసుకెళ్లిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వ్యక్తం కావడంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ముగ్గురు ఎస్సైలను సస్పెండ్ చేస్తూ గద్వాల జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీచేశారు. అన్నదాతలను కోర్టుకు తీసుకెళ్లే క్రమంలో ఉన్నతాధికారుల సూచనలు పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆర్ఎస్సై చంద్రకాంత్, ఏఆర్ఎస్సై సురేశ్, ఆంజనేయులును సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కాగా, అంతకుముందే రాజోళి ఎస్సై జగదీశ్వర్ రైతులపైనా ఇలాంటి ఆరోపణలే రావడంతో తొలుత ఆయనను ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆ తర్వాత నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ చేశారు. మరోవైపు, రాజోళి మండలంలో నిర్మిస్తున్న ఇథనాల్ ఫ్యాక్టరీపై నిజనిర్ధారణ చేపట్టడానికి వెళ్తున్న పౌర హక్కుల సంఘం రాష్ట్ర నేతలను గద్వాల జిల్లా ఎర్రవల్లి చౌరస్తాలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. భూమి కోసం పోరాడే రైతులకు సంకెళ్లు వేస్తారా? అంటూ అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ మండిపడ్డారు. జైలు నుంచి విడుదలైన రైతులు కర్నూల్ వెళ్లి ఎమ్మెల్యే విజయుడును కలిశారు.

ఇది రాక్షస ప్రభుత్వం: నిరంజన్‌రెడ్డి

కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వం కాదని, రాక్షస ప్రభుత్వమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ధ్వజమెత్తారు. అన్నదాతలకు సంకెళ్లు వేయడం ప్రభుత్వ నిరంకుశ మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు. ఇది ఇందిరమ్మ రాజ్యం కాదని, ఎమర్జెన్సీ పాలన అని దుయ్యబట్టారు. ప్రశ్నించే వారిని, ఎదిరించిన వారిని తప్పుడు కేసులతో వేధిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక వ్యవసాయానికి వెన్నుపోటు పొడిచిందని, ఇథనాల్ కంపెనీ వద్దన్న రైతులపై ఉక్కుపాదం మోపుతుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

రాకాసిలా రేవంత్ సర్కారు: ఆంజనేయగౌడ్

ఆంధ్రా కంపెనీకి కాపలాదారుగా మారిన రేవంత్ సర్కారు నడిగడ్డ రైతుల పాలిట రాకాసిలా దాపురించిందని శాట్ మాజీ చైర్మన్ ఆంజనేయగౌడ్ ఆవేదన వ్యక్తంచేశారు. రాజోళి రైతులపై ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు. ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా ఉద్యమించిన రైతులను అరెస్ట్ చేసి, దారుణంగా హింసించారని, జైలుకు పంపి ఏరువాక పండుగకు దూరం చేశారని మండిపడ్డారు. భూమి కోసం పోరాడిన రైతులకు ఉగ్రవాదుల్లా సంకెళ్లు వేయడం దారుణమన్నారు. సొంత జిల్లా ప్రజలపై కనీస మమకారం చూపని రేవంత్ ప్రభుత్వాన్ని ఉమ్మడి పాలమూరు ప్రజలు అసహించుకుంటున్నారని అన్నారు.

మహబూబ్ నగర్ జిల్లా జైలు నుంచి విడుదలైన రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ జైలు నుంచి విడుదలైన రైతులను మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పరామర్శించారు. జైలు వద్దే వారితో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వంపై పోరాటంలో కలిసి నడుస్తామని భరోసా ఇచ్చారు. రైతులపై రేవంత్ సర్కారు వ్యవహరిస్తున్న తీరును ఖండించారు. ఇప్పుడిప్పుడే పచ్చబడుతున్న పొలాల్లో పరిశ్రమ సరికాదని, పచ్చని పొలాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని దుయ్యబట్టారు. రైతులను దొంగల్లా చూస్తూ బేడీలు వేయడం బాధాకరమని ఆగ్రహం వ్యక్తంచేశారు.

రేవంత్.. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం: హరీశ్

జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు సంకెళ్లు వేయడంపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. రైతులకు సంకెళ్లు వేయడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటూ ఎక్స్ వేదికగా మండిపడ్డారు. 'లగచర్ల నుంచి రాజోళి దాక రైతు చేతులకు సంకెళ్లు.. పౌరహక్కుల నేతలపై నిర్బంధాలు, ఇవేనా రేవంత్‌రెడ్డీ నువ్వు చెప్పిన ఇందిరమ్మ రాజ్యం ఆనవాళ్లు!' అని ప్రశ్నించారు.

అన్నదాతలకు సంకెళ్లా?

- రేవంత్ రాక్షసత్వానికి ఇది పరాకాష్ఠ
- 'ఇథనాల్' బాధిత రైతులకు బేడీలు వేయడం సిగ్గుచేటు
- ప్రజాస్వామ్య విలువలకు సర్కార్ పాతర
- రైతులకు సీఎం క్షమాపణ చెప్పాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ) : జోగులాంబ గద్వాల జిల్లా పెద్ద ధన్వాడలో ఇథనాల్ ఫ్యాక్టరీకి వ్యతిరేకంగా పోరాడుతున్న రైతులకు పోలీసులు బేడీలు వేయడం దుర్మార్గమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అన్నదాతల చేతికి సంకెళ్లు వేసి అలంపూర్ కోర్టుకు తీసుకురావడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాక్షస మనస్తత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తమ భూముల్లో ఇథనాల్ ఫ్యాక్టరీ వద్దంటూ కొన్ని నెలల నుంచి శాంతియుతంగా పోరాడుతున్న రైతులపై అక్రమ కేసులు పెట్టి వారికి దొంగల మాదిరిగా బేడీలు వేసి ప్రజాస్వామ్య విలువలకు ఈ ప్రభుత్వం పాతర వేసిందని ఫైర్ అయ్యారు. గతంలో తన అల్లుడి ఫార్మా కంపెనీని అడ్డుకుంటున్నారన్న అక్కసుతో లగచర్ల రైతులపైనా ఇదే విధంగా రేవంత్‌రెడ్డి అమానుషంగా ప్రవర్తించారని మండిపడ్డారు. గుండెపోటుతో పడిపోయిన వ్యక్తికి కూడా కనికరం లేకుండా బేడీలు వేయించారని, ఆ ఘటన కాంగ్రెస్ ప్రభుత్వ చరిత్రలో మచ్చగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఇప్పుడు పెద్ద ధన్వాడ రైతులను లక్ష్యంగా చేసుకొని పోలీసులతో హింసించడం ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని విమర్శించారు. ముఖ్యమంత్రి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతున్నదని, రైతులకు రేవంత్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దేశానికి అన్నం పెట్టే రైతుల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న రేవంత్‌రెడ్డికి అన్నదాతల చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

లోకం పోకడ

బుక్స్ లేవని ఫేస్‌బుక్కులో మునిగిపోయారు... ప్రభుత్వం అమలు చేస్తామన్న డిజిటల్ విద్య ఇదేనా?

వానా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.2°c	22.9°c
నల్లగొండ	37.0°c	23.4°c
వరంగల్	37.0°c	26.0°c
మెదక్	36.0°c	27.0°c
ఖమ్మం	36.0°c	27.0°c
రంగారెడ్డి	35.6°c	21.8°c
నిజామాబాద్	35.5°c	25.9°c
హైదరాబాద్	34.4°c	24.0°c
కరీంనగర్	34.0°c	28.0°c
మహబూబ్‌నగర్	34.0°c	26.0°c

రాష్ట్రంలో ఆరు రోజులు వర్షాలు

- కొనసాగుతున్న ఉపరితలద్రోణి: ఐఎండీ

హైదరాబాద్, జూన్ 18 (నమస్తే తెలంగాణ): ఉపరితలద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈనెల 24 వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేడు(గురువారం) ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. శుక్ర, శనివారాల్లో అన్ని జిల్లాల్లో ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. ప్రభావిత జిల్లాలకు ఈనెల 24వ తేదీ వరకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. గడిచిన 24 గంటల్లో ఆసిఫాబాద్ జిల్లా వాంకిడిలో అత్యధికంగా 1.36 సెంటీమీటర్ల వర్షం కురిసిందని పేర్కొంది.

'హ్యామ్' రోడ్లతో నష్టమే!

మొదటిపేజీ తరువాయి...

ఉపాధికి భద్రత కల్పించాల్సిన అవసరం ఉన్నది. ప్రస్తుత పరిస్థితుల్లో రోడ్ల విస్తరణ కంటే, ప్రస్తుత రోడ్లను పునరుద్ధరించడంపై దృష్టి కేంద్రీకరించడమే సమంజసం. తద్వారా వాహనాల గమనానికి సరైన సౌకర్యం కలుగుతుంది. అంతేకాదు, నాణ్యతతో కూడిన పనులు జరుగుతాయి. ప్రతీ నియోజకవర్గాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని, అక్కడి రోడ్లను రెన్యువల్ చేసి, ఏడేండ్ల మెయింటెనెన్స్ కాంట్రాక్టుకు టెండర్లను పిలవవచ్చు. ఈ విధానం ద్వారా కాంట్రాక్టర్లు క్వాలిటీ పనులు చేయగలుగుతారు. రెగ్యులర్ మాడల్‌తోనే ప్రభుత్వం హైబ్రిడ్ మాడల్‌లో ఖర్చు చేస్తామన్న 40% నిధులతోనే పనులు చేయవచ్చు. ప్రతిపాదిత 'హ్యామ్' మాడల్‌లో ప్రభుత్వం వర్కింగ్ పీరియడ్ (2.5 ఏండ్లు) నాటికి 40% ఖర్చు చేస్తుంది. మిగిలిన 60% టోల్ ద్వారా వసూలు చేయాల్సిన పరిస్థితి ఉన్నది. అది మన రాష్ట్రంలో మాత్రం సాధ్యం కాదు. కాబట్టి ఈ విధానం ప్రయోజనకరం కాదు. ఉదాహరణకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్‌వై)లో వర్కింగ్ పీరియడ్‌తోపాటు ఐదేండ్ల మెయింటెనెన్స్‌ను కలిపి టెండర్లు పిలుస్తున్నారు. ఈ విధానం సుదీర్ఘకాలంగా విజయవంతంగా కొనసాగుతున్నది. అందుకే ముఖ్యమంత్రి గారికి మా మనవి.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, హ్యామ్ మాడల్‌ను పునఃసమీక్షించి, లోకల్ కాంట్రాక్టర్లు, ప్లాంట్లు, కార్మికుల జీవనోపాధిని కాపాడే విధంగా, ప్రభుత్వంపై భారం లేకుండా ఉండే విధంగా, ప్రస్తుతం ఉన్న విధానానికి మెయింటెనెన్స్ కాంట్రాక్టు పద్ధతిని జతచేసి కొనసాగించాలని కోరుతున్నాం' అని బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తమ లేఖలో సీఎంకు విజ్ఞప్తిచేసింది.

అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

- సరైన బిగుబడులు లేక మనస్తాపం
- సిద్దిపేట జిల్లా కొండాపూర్‌లో విషాదం

జగదేవపూర్, జూన్ 18 : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం కొండాపూర్‌లో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. కొండాపూర్‌కు చెందిన తీగుల్ల రాజు (35) దౌలాపూర్‌లో మూడెకరాలు కౌలుకు తీసుకొని పత్తి, మక్క సాగుచేసేవాడు. పెట్టుబడి కోసం రూ.2 లక్షలు అప్పు చేశాడు. పంట సరిగ్గా పండక, అప్పులు తీర్చే మార్గం లేక మనోవేదనకు గురయ్యాడు. అప్పులు తీర్చే మార్గంలేక సతమతమవుతున్న అతనికి అనారోగ్య సమస్య మరింత కలిచివేసింది. తీవ్ర మనస్తాపం చెందిన ఆయన తాను నివసిస్తున్న పూరి గుడిసెలోనే మంగళవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కూలీ పనులకు వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చిన భార్య.. రాజు పరిస్థితిని గమనించి స్థానికుల సాయంతో గజ్వేల్ సర్కారు దవాఖానకు తరలించింది. మెరుగైన వైద్యం కోసం గాంధీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఫీజు బకాయిలపై ఉమ్మడిపోరు

మొదటిపేజీ తరువాయి...

(ఎఫ్ఏటీహెచ్ఐ)గా ఏర్పడ్డాయి. అధ్యక్షుడిగా నిమ్మటూరి రమేశ్‌బాబు, సెక్రటరీ జనరల్‌గా కేఎస్ రవికుమార్, కోశాధికారిగా కొడాలి కృష్ణారావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా కే సునీల్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా ముద్దసాని రమేశ్‌రెడ్డి, జీ నాగయ్య, పీ రమేశ్‌బాబు, గోపగాని వెంకట నారాయణ, టీ శ్రీనివాస్ ఆచార్య, ఎండీ గౌస్ మెయినుద్దీన్‌లతో పాటు మొత్తం 33 మందితో కార్యవర్గాన్ని ప్రకటించారు.

బాధతోనే ఏకమయ్యాం: రమేశ్‌బాబు

ప్రభుత్వం బకాయి పడిన రూ. 8 వేల కోట్ల రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడంతో బాధతోనే తామంతా కన్సార్షియంగా ఏర్పడ్డామని ఏఎఫ్‌టీహెచ్ఐ అధ్యక్షుడు రమేశ్‌బాబు తెలిపారు. సర్కారుకు రైతులు, కాంట్రాక్టర్లు, ఇతర సంక్షేమ పథకాలు మొదటి ప్రాధాన్యం అయ్యాయని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చివరి ప్రాధాన్యం కావడం తమను తీవ్రంగా కలిసివేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. తామున్నామన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. ఫీజు బకాయిలు విడుదల చేయకపోవడంతో యాజమాన్యాలు కోర్టుకెళ్లాల్సిన పరిస్థితి నెలకొన్నదన్నారు. ఫెడరేషన్ తరపున మరో వారం రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులను కలిసి బకాయిలు విడుదల చేయాలని వినతిపత్రాలు సమర్పిస్తామని చెప్పారు.

డిమాండ్లివే..

- టోకెన్లు జారీ అయిన 2 వేల కోట్ల బకాయిలను 30లోపు విడుదల చేయాలి.
- 2023-24 విద్యాసంవత్సరం బకాయిలను సెప్టెంబర్ 30లోపు ఇవ్వాలి.
- 2024-25 విద్యాసంవత్సరం బకాయిలను డిసెంబర్ 30లోపు విడుదల చేయాలి.

నేనేం చేయలేను.. బీఆర్ఎస్ వాళ్లనే కలవండి!

ఎనికెపల్లిపై చేతులెత్తేసిన ఎమ్మెల్యే యాదయ్య

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 18 (నమస్తే తెలంగాణ): 'నేనేం చేయలేను... మీరు బీఆర్ఎస్ వాళ్లను కలవండి' ఇవీ బీఆర్ఎస్‌లో గెలిచి, కాంగ్రెస్‌లో చేరిన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఎనికెపల్లి రైతులతో చేసిన వ్యాఖ్యలు. తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములను గోశాల పేరుతో సర్కారు లాక్కుంటున్నదని, ఆదుకోవాలంటూ వచ్చిన రైతులు, ప్రజలతో ఎమ్మెల్యే మాట్లాడిన తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇందిరాగాంధీ హయాంలో రంగారెడ్డి జిల్లా ఎనికెపల్లిలో 99.14 ఎకరాల భూమిని 50 మంది పేదలకు పంపిణీ చేశారు. ఆ భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటుండగా.. అక్కడ గోశాల ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించి, బోర్డులు ఏర్పాటు చేసింది. జీవనోపాధి కోల్పోకుండా ఆదుకోవాలని రైతులు ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆశ్రయించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి న్యాయం చేస్తానని చెప్పుకొచ్చిన ఆయన.. ఇప్పుడు తానేమీ చేయలేనంటూ చేతులెత్తేశారని అన్నదాతలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైతులు హైకోర్టును కూడా ఆశ్రయించారు. రెండు రోజుల కిందట వాదనలు మొదలయ్యాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ప్రత్యక్ష ఆందోళనలు కూడా చేపట్టాలని, ఇందులో భాగంగా నేడు నిరసన దీక్షలు ప్రారంభించనున్నట్టు తెలిసింది.

ఆ పది మండలాల్లో రైతుభరోసా రద్దు

- రంగారెడ్డిలో లక్ష ఎకరాలకు ఎగనామం
- ప్రభుత్వ నిర్ణయంపై రైతుల ఆగ్రహం
- పాలాల్లో నిరసన తెలిపిన కీసర రైతులు
- తహసీల్దార్‌కు మహేశ్వరం రైతుల వినతి
- రేవంత్ సర్కారును దించేస్తామని హెచ్చరిక
- పది మండలాల రైతులకు రైతుభరోసా రద్దు అన్యాయం : మాజీ మంత్రి సబిత

మహేశ్వరం మండలంలో రైతుభరోసాను కొనసాగించాలని తహసీల్దార్ సైదులుకు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హైదరాబాద్ సిటీబ్యూరో/ బడంగ్‌పేట/కీసర, జూన్ 18 (నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లాలోని పది మండలాల్లో రైతుభరోసా పథకాన్ని రద్దు చేయడంపై రైతులు భగ్గుమంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. రైతులు తమ పొలాల్లోనే నిరసన వ్యక్తంచేస్తూ.. రేవంత్ సర్కార్‌పై పోరుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి రైతులకు మద్దతుగా నిలిచారు. రైతుభరోసా ఎలా నిలిపేస్తారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రంగారెడ్డి జిల్లాలోని మహేశ్వరం, బాలాపూర్, ఇబ్రహీంపట్నం, అబ్దుల్లాపూర్, హయత్‌నగర్, రాజేందర్‌నగర్, శంషాబాద్ తదితర మండలాల్లో ఉన్న రైతులకు రైతుభరోసా బ్యాన్ చేశారని సబితా ఇంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉన్నప్పుడు కూడా హైదరాబాద్ నగర శివారుల్లో ఉన్న రైతులు ఎక్కువ శాతం ఆకుకూరలు, కూరగాయలు పండించేవారని గుర్తుచేశారు. రవాణా సౌకర్యం, మార్కెట్ అందుబాటులో ఉండటం, త్వరగా చేతికొచ్చే పంటలు కనుక రైతులు కూరగాయలు, ఆకుకూరలపై ఎక్కువ దృష్టి పెట్టేవారని చెప్పారు. హైదరాబాద్ శివారు మండలాల్లో ఉన్న రైతులకు రైతుభరోసాను బ్యాన్ చేయడం ఏమిటని మండిపడ్డారు. వారికి రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ పార్టీ తరపున రైతులకు అండగా నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు. కేసీఆర్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన రైతుబంధుకు కాంగ్రెస్ ప్రభుత్వం మంగళం పాడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు.

కీసరలో రైతుల నిరసన

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని కీసరకు చెందిన పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కీసరలో బుధవారం రైతులంతా కలిసి తమ పొలాల్లో నిరసన వ్యక్తంచేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ఉన్న వేలాది మంది రైతులకు ఇప్పటివరకు రైతుభరోసా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తంచేశారు. మూడుచింతలపల్లి మండల రైతులకు రైతుభరోసా ఇచ్చి, మేడ్చల్, శామీర్‌పేట, కీసర, ఘట్‌కేసర్ మండల్లాలోని రైతులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నిస్తున్నారు. తమ నియోజకవర్గంలోని రైతుల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు వివక్ష చూపుతున్నారని ప్రశ్నించారు. ఒక్క మండలానికే రైతుభరోసా ఇవ్వడంలో అంత ర్యం ఏమిటని నిలదీశారు. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున్న ధర్నాకు దిగుతామని ప్రకటించారు. రైతులను పట్టించుకోకపోతే ఈ ప్రభుత్వాన్ని దించేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ముద్దం శివయాదవ్, ముద్దం మల్లేశ్, సుంకరి కృష్ణారెడ్డి, రామిడి ప్రతాప్‌రెడ్డి, రామిడి నర్సింహారెడ్డి, చెట్టి మధుయాదవ్, కరెంట్ బాల్‌రెడ్డి, రామిడి పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం తహసీల్దార్‌కు వినతిపత్రం

మహేశ్వరం మండలంలో రైతుభరోసాను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు మహేశ్వరం తహసీల్దార్ సైదులుకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పోర్టు సిటీలో ఉన్న కందుకూరు మండల రైతులకు రైతుభరోసా ఇచ్చి మహేశ్వరం మండల రైతులకు ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. మహేశ్వరం మండలంలో ఎంత వ్యవసాయ భూమి ఉన్నదో అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని డిమాండ్ చేశారు. అధికారులు గుడ్డిగా వ్యవహరించి రైతులు వ్యవసాయం చేస్తలేరన్నట్టు ధ్రువీకరించడం బాధాకరమని పేర్కొన్నారు. అర్హులైన రైతులకు రైతుభరోసా ఇవ్వకపోతే మహేశ్వరం నియోజకవర్గవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాజునాయక్, కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్యయాదవ్, వెంకటేశ్వరరెడ్డి, యాదగిరి, ప్రభాకర్, ఆదిల్, రాయప్ప, నర్సింగ్‌తోపాటు పలువురు రైతులు పాల్గొన్నారు.